# 14. వ్యాసుడు

జయతి పరాశరసూనుః
సత్యవతీనందనో వ్యాసః।
యస్యాఽస్య కమలగలితం
వాఙ్మయమమృతం జగత్పిబతి।।

ఎవరి ముఖ కమలం నుండి జాలువారిన సారస్వత అమృతాన్ని లోకమంతా తాగుతోందో, అటువంటి పరాశర పుత్రుడు, సత్యవతీదేవికి ఆనందాన్ని కలిగించేవాడు అయిన వ్యాసుడు జయిస్తున్నాడు.

**2.** లోకంలో అధర్మం పెరిగినప్పుడల్లా అవతరించి, దాన్ని తుంచి వేస్తానని

భగవంతుడే స్వయంగా ప్రతిజ్ఞ చేసి ఉన్నాడు.

యదా యదా హి ధర్మస్య
గ్లానిర్భవతి భారత!।
అభ్యుత్థానమధర్మస్య
తదాత్మానం సృజామ్యహం।।

అని. చాలామంది రాక్షస సంహారానికే భగవంతుడు అవతరిస్తాడని అనుకొంటూ ఉంటారు.

**3**. భగవంతుడి అవతారాలలో దుష్టశిక్షణ కూడా భాగమే. కానీ అదే ముఖ్యం కాదు.

**4**. జీవులలోని అజ్ఞానాన్ని తొలగించి వారిని

జ్ఞానవంతుల్ని చేయటం భగవంతుడి అవతారాలకు ముఖ్య ఉద్దేశ్యం.

**5**. అందుకే దుష్టశిక్షణ అయిన తరువాత కూడా తన అవతార శరీరంతోనే చాలాసార్లు ఈ లోకంలోనే ఉండిపోయాడు భగవంతుడు.

**6**. ఇక తన జ్ఞానప్రసారానికి, భక్తుల జ్ఞానార్జనకూ అడ్డంకులు తొలగిపోయాయి అనిపించినప్పుడు, జ్ఞానబోధ మొదలు పెడతాడు.

**7**. కొన్ని అవతారాలను కేవలం జ్ఞానోపదేశం కోసమే భగవంతుడు స్వీకరించాడు.

**8**. వాటిలో ముఖ్యమైనది వ్యాసావతారం.

జీవులకు జ్ఞానం తప్ప వేరేదీ ముఖ్యం కాదు కనుక, ఒక్క వైవస్వత మన్వంతరంలోనే భగవంతుడు ఇరవై ఎనిమిదిసార్లు వ్యాసుడిగా అవతరించాడని గ్రంథాలు చెపుతున్నాయి.

**9.** గడిచిన ద్వాపరంలో మహావిష్ణువు కృష్ణద్వైపాయనుడనే పేరుతో పరాశరుడి పుత్రుడిగా అవతరించాడు.

**10.** ఈయన తల్లి పేరు సత్యవతి. పరాశరుడు తపస్సుతో శివుణ్ణి ప్రసన్నం చేసుకొని, "నీ వంటి పిల్లవాణ్ణి అనుగ్రహించు" అని ప్రార్థించాడు.

పాట

**11.** మహావిష్ణువు సంకల్పానికి శివుడి వరం తోడై సత్యవతీ పరాశరులకు ఒక అద్భుతద్వీపంలో పిల్లవాడు జన్మించాడు.

**12.** ద్వీపంలో పుట్టాడు కనుక, పిల్లవాణ్ణి ద్వైపాయనుడు అన్నారు. నల్లగా ఉండటం వల్ల కృష్ణుడు అన్నారు.

**13.** రెండు పేర్లూ కలిసి 'కృష్ణ ద్వైపాయనుడు' అనే పేరు వచ్చింది.

**14.** ఆయనకు బాల్యమే లేదు. ఆయన పుడుతూనే బాల్య కౌమారాలను దాటి

యౌవనదశకు చేరాడు.

**15.** పుట్టగానే పెద్దవాడైన ద్వైపాయనుడు 'తను తపస్సుకు వెళ్లటానికి అనుమతించవలసిందిగా' తల్లీ తండ్రులను కోరాడు.

**16.** తండ్రి అంగీకరించాడు. తల్లి మాత్రం అడ్డగించింది. కొన్నాళ్లైనా దగ్గర ఉండి వెళ్లమంది.

**17.** కొడుకు కుదరదన్నాడు. చివరకు సత్యవతీ దేవి "తాను స్మరించినప్పుడు తన ముందుకు వచ్చి వాలుతానని మాట ఇస్తే, నీ కోరికను అంగీకరిస్తాను" అన్నది.

**18.** తల్లి కోరిక ప్రకారం మాట ఇచ్చి, ద్వైపాయనుడు తపస్సుకై బదరికాశ్రమానికి వెళ్లాడు.

దీర్ఘం కాలమయం తపశ్చ
బదరీ కాంతార పుణ్యాశ్రమే
తప్త్వా తేన బలేన వేద
వితతేర్భాగం చతుర్ధాకరోత్
తంచాష్టాదశ సత్పురాణ
నిచయం శ్రీమన్మహాభారతం
తచ్ఛారీరక సూత్ర జాత
మకరోత్ తం వ్యాసమౌనిం భజే॥

భావం: హిమాలయాలలోని

బదరికాశ్రమంలో ద్వైపాయనుడు సుదీర్ఘమైన తపస్సు చేశాడు. ఆ తపోబలంవల్ల ఏకరాశిగా ఉన్న వేదాన్ని ఋగ్యజుస్సామ అథర్వణ వేదాలుగా విభజించి వేదవ్యాసుడనే బిరుదును పొందాడు.

**19.** పద్ధెనిమిది పురాణాలను మహాభారతాన్ని బ్రహ్మసూత్రాలను ఆయన రచించాడు.

**20.** వీటిలో మహాభారతం సామాన్యుల కోసం, బ్రహ్మసూత్రాలు పండితుల కోసం ఉద్దేశింపబడ్డాయి.

21. ఈ విధంగా కర్మ, ఉపాసన, జ్ఞానాలనే మూడు కాండలను విస్తరింప చేయటానికి కావలసినదంతా చేసి, మానవలోకానికి హితం చేశాడు.

22. ఇప్పుడు మనం వ్యాసమహర్షియొక్క భక్తి తత్త్వాన్ని గురించి మాట్లాడుకోవటానికి ఇక్కడ చేరి ఉన్నాము.

23. వ్యాసుడు భగవద్భక్తికన్నా ముందు మాతృభక్తిని ప్రకటించాడు. తల్లిని గౌరవించిన వారే భక్తికి యోగ్యులవుతారు. జ్ఞానులవుతారు అని చెప్పటానికే వ్యాసమహర్షి అలా చేశారు.

**24.**

బద్ధో మాతు రథాజ్ఞ యైవ
    సతతానుల్లంఘ్యయా నిష్ఠురం
పుత్రాం స్తాన్ ధృతరాష్ట్ర పాండు
    విదురా నుత్పాద్య లోకోత్తరాన్।
వంశం కౌరవ నామకం
    పునరపి ప్రోజ్జీవితం యోకరోత్
శ్రీమద్భారత వర్ష భాగ్యమమలం
    తం వ్యాసమీడే మునిమ్।।

భావం:  మహాభారతంలో వ్యాసుడి పాత్ర ఈ చివరి నుంచి ఆ చివరి దాకా ఉంటుంది. వ్యాసుడికి ఒక సంకటస్థితి వచ్చింది.

అదేమిటంటే, తల్లి ఆజ్ఞను తిరస్కరించలేక ఆయన కౌరవ వంశం అంతరించిపోకుండా నిలబెట్టవలసి వచ్చింది.

**25.** తల్లి ఆజ్ఞ అన్నిటికన్నా గొప్పది. ఆయనకు ప్రత్యేకంగా కౌరవ వంశం మీద ఆసక్తి లేకపోయినా తల్లి ఆజ్ఞను కాదనలేక కురువంశాన్ని నిలబెట్టాడు.

**26.** మహాత్ములైన వారందరూ తల్లిని పరదేవతగానే చూసి ఆరాధించారు. అందువల్లే వ్యాసుడు తల్లి ఆజ్ఞకు కట్టుబడి తన తపోవిధానాన్ని మార్చుకుని కురువంశాన్ని నిలబెట్టాడు.

**27.** మహాభారత కథంతా వ్యాసుడు చేసిన ఈ మహత్తరమైన మాత్రాజ్ఞా పరిపాలన మీదే ఆధారపడి ఉంది.

**28.** వ్యాసమహర్షి వినయం వల్ల, మాతృభక్తి వల్ల మనకు అంతటి గొప్ప గ్రంథం చిక్కింది.

**29.** అలా మహాభారతానికి మూలకారణమైన వ్యాసమునిని నిత్యం స్తుతిస్తూ ఉండాలి.

**30.** ఎంతోమంది మహాపురుషులు వ్యాసుని వద్దకు వచ్చి, ఉపదేశాలు పొందుతూ ఉండేవారు.

**31**. ఆయన మాటలలో అదేమి శక్తి ఉండేదో గానీ, ఆయన మాటలు వినగానే బ్రహ్మతత్త్వం బోధపడేది.

**32**. వ్యాసాశ్రమంలో వందలమంది శిష్యులు తయారయ్యారు. ధర్మప్రచారం బాగా జరిగింది. లోకంలో వేదవిహిత కర్మలు నిలిచాయి.

**33**. అన్ని వ్యవహారాలకూ, అన్ని ధర్మసూక్ష్మాలకూ మహాభారతం మూలదండమైంది.

**34**. అందరూ దాన్ని చదివి ఆచరించసాగారు. వేదాంతులు

బ్రహ్మసూత్రాలను అధ్యయనం చేసి, బ్రహ్మతత్త్వాన్ని సులభంగా తెలుసుకున్నారు.

**35.** ఇలా సమస్త వాఙ్మయానికీ కారకుడైనప్పటికీ వ్యాసమహర్షి మనస్సులో ఏదో తెలియని వెలితి ఉండేది.

**36.** ఆ వెలితి పోయి మనశ్శాంతి సిద్ధించాలని ఇరవై ఒకటవ గురువైన వాసుదేవుడి నుండి ఉపదేశాన్ని పొందాడు.

**37.** సనకాది మహర్షులను సంప్రదించి, వారితో చర్చలు జరిపాడు. అయినా వ్యాసుడికి మనశ్శాంతి కరువైంది.

**38.** కాకపోతే వారందరినీ కలవటంవల్ల తాను చేయవలసిన పని ఇంకా వుందని వ్యాసమహర్షికి అర్థమైంది.

**39.** సరస్వతీ నదీ తీరంలో కూర్చుని "ఏమి చేస్తే తాను సంకల్పించిన లోకకళ్యాణ కార్యం పూర్తి అవుతుందా?, మనశ్శాంతి లభిస్తుందా?" అని ఆలోచించసాగాడు.

**40.** ఆ సందర్భంలో దైవవశాత్తూ నారదమహర్షి నారాయణ గానం చేస్తూ అక్కడికి వచ్చాడు.

పాట

అచ్యుతానంత శ్రీధర మాధవ (భజనభారతి)

**41.** వ్యాసమహర్షి ఆయనకు స్వాగతం పలికి, ఆసనాన్ని ఇచ్చి కూర్చోబెట్టాడు.

**42.** నారదుడు శాంతంగా ఇలా పలికాడు - "వ్యాసా! నువ్వు చాలా గొప్ప పని చేశావు. లోకాలకు అందించవలసినదంతా అందించావు. అయినా విచారిస్తున్నావు. నీ అశాంతికి కారణమేమిటి?" అన్నాడు.

**43.** అప్పుడు వ్యాసుడు 'నారదమహర్షీ! మీకంతా తెలుసు. మీ దగ్గర దాచేది ఏముంది? లోకులందరూ నేను చాలా గొప్పవాడినని, జ్ఞానానికి సాగరం

లాంటివాడినని కీర్తిస్తున్నారు. నిజమే. కానీ నాకు మాత్రం నేను చేసిన రచనల వల్ల తృప్తి కలగలేదు.

**44**. ఆ రచనలన్నీ సాధకులకు ఉపయోగపడేవే. వాటిలో అన్ని విషయాలూ ఉన్నాయి. కానీ నాకు మాత్రం తృప్తి లేదు.

**45**. నేను చేయవలసిన పని ఇంకా మిగిలి ఉన్నదని, అది పూర్తి అయితే కానీ, నా రచనలకు పరిపూర్ణత సిద్ధించదనీ నాకు తెలుస్తోంది.

**46**. కానీ ఏది రచిస్తే ఆ తృప్తి కలుగుతుందో అది మాత్రం తెలియటం

లేదు. అందువల్ల నాపై దయ ఉంచి ఈ చింత నుండి బయటపడే మార్గాన్ని ఉపదేశించండి' అని ప్రార్థించి, గురువైన నారదుడికి నమస్కరించాడు.

అజ్ఞాన తిమిరాంధస్య
జ్ఞానాంజన శలాకయా।
చక్షురున్మీలితం యేన
తస్మై శ్రీగురవే నమః।।

**47.** నారదుడు సంతోషించి, వ్యాసమహర్షికి చతుశ్శ్లోకీ (నాలుగు శ్లోకాల) భాగవతాన్ని ఉపదేశించి, భగవంతుడి కథలను కీర్తించమని, దాంతో శాంతి కలుగుతుందని

చెప్పి వెళ్ళి పోయాడు.

**48.** వ్యాసమహర్షి నారదోపదేశానికి చాలా సంతోషించి, బదరికాశ్రమంలో భాగవత రచనను పూర్తి చేశాడు.

**49.** భాగవతం భక్తులకు ప్రాణం లాంటిది. దానికి 'పరమహంస సంహిత' అని, 'సాత్త్వతీశ్రుతి' అని పేర్లు వచ్చాయి.

**50.** సాత్త్వతీశ్రుతి అంటే విష్ణు భక్తుల వేదమని అర్థం. ఇలా భాగవత సంప్రదాయానికే వ్యాసభగవానుడు మూలపురుషుడయ్యాడు.

**51.** ఇక ఆయనను భాగవతోత్తముడు

అనటానికి సందేహమేముంది?

**52.** భాగవతంలో భక్తితో జ్ఞానం లభించే మార్గాలను వ్యాసమహర్షి తెలిపాడు.

**53.** మహాభారతం కర్మకూ, ధర్మానికీ, జ్ఞానానికీ, ఉపయోగించే గ్రంథం. వ్యాసమహర్షి చేసిన భారత రచనకు ఆశ్చర్యపోయిన మహర్షులు భక్తితో ఆయనను ఇలా కీర్తించారు.

నమోస్తుతే వ్యాసవిశాలబుద్ధే
ఫుల్లారవిందాయత పత్రనేత్ర।
యేన త్వయా భారత తైలపూర్ణః
ప్రజ్వాలితో జ్ఞానమయః ప్రదీపః॥

**54.** మహాభారతమనే తైలంతో జ్ఞానమనే దీపాన్ని వెలిగించిన విశాలబుద్ధివైన ఓ వ్యాసమహర్షీ! నీకు నమస్కారం.

**55.** భాగవత రచన అయిన తరువాత జ్ఞానులు వ్యాసుణ్ణి సాక్షాత్తూ మహావిష్ణువే అని గుర్తించి, విష్ణు వ్యాసులకు అభేదాన్ని చెప్పి కీర్తించారు.

వ్యాసాయ విష్ణురూపాయ
వ్యాసరూపాయ విష్ణవే।
నమో వై బ్రహ్మ నిధయే
వాసిష్ఠాయ నమో నమః।।

విష్ణురూపుడైన వ్యాసుడికి నమస్కారం.

వ్యాసరూపుడైన విష్ణువుకు నమస్కారం.
బ్రహ్మపదార్థానికి నిధి అయిన వ్యాసమహర్షికి
నమస్కారం.

**56**. భాగవత రచన అయిన కొంతకాలానికి
వ్యాసుడు శుకమహర్షికి దాన్ని
ఉపదేశించాడు. తరువాత భాగవత పరంపర
కొనసాగింది.

**57**. ప్రపంచం నలుమూలలా భక్తి జ్ఞానాలు
వికసించాయి.

**58**. భారతదేశమంతటా వ్యాసమహర్షి
పేరుతో ఆశ్రమాలు స్థాపింపబడ్డాయి.

**59**. వాటిలో మహాభారతం, భగవద్గీత,

భాగవతం, బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్తులు, అన్నీ కూడా బోధింపబడ్డాయి.

**60.** వ్యాసుడికి తన అవతారలక్ష్యం పూర్తి అయిందని తోచింది.

**61.** తపోమగ్నుడై జ్యోతిస్స్వరూపంగా మారిపోయాడు. ఈనాటికీ సత్సంగాలలో వ్యాసమహర్షి వచ్చి కూర్చుని వింటాడని అందరి నమ్మకం.

**62.** ఆయన జ్ఞానస్వరూపి కనుక, నిత్యమూ ఉండేవాడు. భాగవతోత్తముడు కనుక భక్తులకు సహాయం చేస్తూ ఉంటాడు.

**63.** వ్యాసుడిని స్మరించి ఆయన చెప్పిన

మార్గంలో నడిచినవారికి ఏ లోపమూ ఉండదు. సమస్త మంగళాలూ సిద్ధిస్తాయి.

**64**. వ్యాసుడి కథలో ఎన్నో గొప్ప గొప్ప ఘట్టాలు ఉన్నాయి.

**65**. వాటన్నిటినీ మనమిప్పుడు చెప్పుకోవటం లేదు. మనకు కావల్సినవి, మనం పట్టుకోవలసినవి  ఆయన చూపిన భక్తి, జ్ఞానమార్గాలు.

జయగురుదత్త